లెవెల్ క్రాసింగ్‌లు మూసివేత : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా జిల్లాలో రేణిగుంట- అరక్కోణం సెక్షన్ పరిధిలో గల లెవెల్ క్రాసింగ్‌లు మూసి వేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంట- అరక్కోణం సెక్షన్ పరిధిలో నగరి- వేపగుంట, వేపగుంట యార్డ్, వేపగుంట- పుత్తూరు, తడుకు యార్డ్‌లో గల లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణ, మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటులో భాగంగా రైల్వేశాఖ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుందని తెలిపారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే కారణంగా లెవెల్ క్రాసింగ్‌లను శాశ్వతంగా మూసి వేయడం జరుగుతుందని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

రైతులను వాణిజ్య పంటల సాగు వైపు మరల్చండి

- ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ ప్రారంభం
- ఖరీఫ్ 2025 కార్యాచరణ ప్రణాళికలు : కలెక్టర్

జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)
జిల్లాలో వరి, చెరకు, మామిడి పంటతో పాటు లాభసాటి వాణిజ్య పంటలు సాగు వైపు రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో ఖరీఫ్ 2025 కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు వరి, చెరకు, మామిడి మొదలగు పంటలపై ఆధారపడి ఉన్నారని, చాలా కాలం నుండి ఒకేరకమైన పంటను పండిస్తున్నారని దీని ద్వారా పంట దిగుబడి తగ్గి నష్టపోతున్నారన్నారు. పంట మార్పిడి విధానం, బహుళ పంటల సాగు, మార్కెటింగ్ సౌకర్యం, నాణ్యమైన విత్తనాల సరఫరా, భూసారం, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై గ్రామస్థాయిలో మండల అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు ఖరీఫ్ -2025 కార్యాచరణపై ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళ్లాలన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను రైతులకు వివరించి ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 2024-25 సంవత్సరంలో ఇప్పటి వరకు 37,861 మంది రైతులతో 41,127 ఎకరాల ప్రకృతి వ్యవసాయ సాగు సాధించామన్నారు. జిల్లాలో ప్రధానంగా పండిస్తున్న వరి, చెరకు, మామిడి పంటలతో పాటు అరటి, బొప్పాయి, పనస వంటి వాణిజ్య పంట సాగు వైపు రైతుల ఆలోచన మార్చే విధంగా కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. గ్రామాలలో నిరుపేద, పేద కుటుంబాల రైతుల మెరుగైన జీవనోపాధుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పంట సాగు పద్ధతులలో మెళకువలు నేర్పి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సహకరించాలన్నారు. గ్రామాలలో ఎస్‌హెచ్‌జిలలో చాలా వరకు రైతులు ఉన్నారని, ప్రభుత్వం అందిస్తున్న రుణాలను నాణ్యమైన విత్తనాల కొనుగోలు, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ కూలీలకు వాడుకునేలా ఎంఎఓ, ఎంహెచ్‌ఓలు అవగాహన కల్పించాలన్నారు. బిందు, తుంపర సేద్యం విధానం ద్వారా జిల్లాలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని అన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మూగజీవాలకు మేత కరువు

గడ్డి లేక అల్లాడుతున్న ఆవులు
కొట్టాలకే పరిమితవుతున్న పశువులు

మేత లేక చెట్ల కింద ఆవులను కట్టేస్తున్న మహిళ

ప్రజాశక్తి- గంగవరం : మేత, నీటి కోసం మూగజీవాలు తల్లడిల్లిపోతున్నాయి. గత సంవత్సరం వర్షం పడకపోవడంతో పచ్చిక భూములు కనపడకుండా పోయాయి. ఎండు, పచ్చిగడ్డి దొరకడం లేదు. దీంతో పశువులు, గొర్రెలు, మేకలను పోషించడం పాడిరైతులకు తీవ్రభారంగా మారింది. ఇతర మండలాలకు, జిల్లాలకు వెళ్లి మేత కొనుగోలు చేసి తీసుకురావాలంటే అధిక ధరలతో పాటు రవాణా ఖర్చులు కూడా ఎక్కువ అవుతాయి. ఆ వ్యయాన్ని భరించలేక పశువులను కొట్టాలకే పరిమితం చేస్తున్నారు. వర్షం పడకపోవడంతో చెరువులు కూడా ఎండిపోయి ఎక్కడ చూసినా భూములు బీడుగా దర్శనమిస్తున్నాయి. పశువుల మేత కోసం ఎక్కడికి తీసుకెళ్లాలో అర్థంకాక పాడి రైతులు లబోదిబో మంటున్నారు. ఎక్కడికి వెళ్లినా మేత, నీరు దొరకకపోడంతో మూగజీవాలు బక్కచిక్కిపోతున్నాయని వాపోతున్నారు.

బీడులో మేత వెతుకుతున్న జీవాలు

మండలంలో అధికశాతం ప్రజలు పాడి పశువులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. సాగునీరు లేకపోవడం, వర్షాలభారం వలన ఎక్కువగా వ్యవసాయం గిట్టుబాటు కాక ప్రజలు పాడిపరిశ్రమపైనే ఆధారపడ్డారు. పైగా ఇక్కడ డైరీలు అధికంగా కూడా ఉన్నాయి. దీంతో ఇంటికో పాడి ఆవును కలిగి ఉన్నారు. గతంలో కాస్తోకూస్తో వర్షాలు పడితే పచ్చికబైళ్లలో గడ్డి కనిపించేది, చెరువుల్లో నీరు ఉండేది. ఈ ఏడాది వర్షం లేక అవికూడా బీడుబారాయి. ఇదే అదునుగా కొందరు వ్యాపారస్తులు తూర్పు మండలాల నుంచి వరిగడ్డిని తెప్పించి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక మోపు వరిగడ్డి రూ.250లకు విక్రయిస్తున్నారు. ఈ మోపు ఓ ఆవుకు ఒకరోజుకు సరిపోతుంది. రోజుకు రూ.250లు ఒక ఆవుకే ఖర్చుపెట్టే పరిస్థితిలో రైతులు లేరు, ఇక మొక్కజొన్న కర్రలు మోపు రూ.400లకు అమ్ముతున్నారు. దీంతో రైతులు పశువులను బయట మేతకు తోలలేక, వరి గడ్డికి ఖర్చు చేయలేక గ్రామాల్లోని చెట్ల కింద కట్టేసి ఉంచుతున్నారు.

ఖర్చుకు తగ్గ ఆదాయం లేదు..
- సుబ్రహ్మణ్యం, పాడి రైతు, గంగవరం
గతంతో అంతోఇంతో గడ్డి ఉండేది. పశువులను మేతకు తోళ్లుకెళ్లి సాయంత్రం వరకు మెపుకునేవాళ్ళం. ఇప్పుడు గడ్డి లేదు, చెరువుల్లో నీళ్లు లేవు. పశువులను ఎలా కాపాడుకోవాలో తెలియడం లేదు. వ్యాపారులు ఒక మోపు గడ్డి రూ.250లకి అమ్ముతున్నారు. ఇదేమని అడుగుతుంటే రవాణా ఖర్చు, గడ్డి తక్కువగా ఉందని ధర తగ్గించేది లేదని చెబుతున్నారు. రోజుకు రూ.250ల చొప్పులు రెండు ఆవులు ఉంటే రూ.500లు ఖర్చు అవుతుంది. అంత ఖర్చుపెట్టినా ఆదాయం అందులో 10 శాతం మాత్రమే ఉంటోంది. పాడి రైతులకు ఉచితంగా గడ్డి సరఫరా చేసి ప్రభుత్వం ఆదుకోవాలి.

లాభాల పంట 'గెనిసి'

- తక్కువ పెట్టుబడి.. అధిక రాబడి..
- రైతులకు ఊరటనిస్తున్న గెనిసిగడ్డలు

ప్రజాశక్తి- గంగవరం: తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక దిగుబడి ఆదాయం అందిస్తున్నాయి తీగ జాతి గెనిసి గడ్డలు. పంట నష్టంతో బాధపడుతున్న రైతులకు గెనిసిగడ్డలు కాస్త ఊరటనిస్తున్నాయి. మండలంలోని చౌడిరెడ్డిపల్లి, బత్తనపల్లి, పత్తికొండ, కీలపల్లి, బాలేపల్లి పరిసర ప్రాంతాల్లో ఇటీవల రైతులు ఎక్కువగా తీగజాతి గెనిసిగడ్డల సాగుపై మక్కువ చూపుతున్నారు. మిగిలిన పంటలకంటే తక్కువ పెట్టుబడితో సులభతరంగా పంటను పండించి లాభాలు చవిచూస్తున్నారు. ఇతర పంటలతో పోల్చితే ఈ పంటకు సాగు నీరు కూడా తక్కువగా ఉన్నా సరిపోతుంది. పైగా పంట సమయం కూడా తక్కువే.. క్రిమిసంహార మందులు, తెగుళ్ల భయాలు లేవు కనుక రైతులు లాభాల పంటవైపు ఆసక్తి చూపుతున్నారు.

లాభదాయకమైన పంట
-చంగల్రాయప్ప, రైతు

నాకు ఒక ఎకరా పొలం ఉంది. రూ.25వేలు ఖర్చు పెట్టి పంట వేశాను. పంట బాగా పండి 70 క్వింటాళ్ల పండింది. నీరు తగ్గిందని భయం లేదు. వ్యవసాయ కూలీల ఖర్చు లేదు. కేవలం 90 రోజుల్లో పంట చేతికందింది. ఈ పంట నవంబర్ నుంచి ఏప్రిల్, మే వరకు పండించుకోవచ్చు. చెన్నైలో గెనిసి గడ్డలకు మంచి మార్కెట్ ఉంది. ఎక్కువగా వ్యాపారులు కొని చెన్నైకి ఎగుమతి చేస్తుంటారు. పెట్టిన పెట్టుబడి కంటే రెట్టింపు వచ్చింది.

నాలుగేళ్లుగా ఈ పంటే ఆధారం..
- సుశీలమ్మ, మహిళా రైతు

నేను ఎకరా పొలంలో గెనిసిగడ్డలు సాగు చేస్తున్నాను. గత నాలుగేళ్లుగా ఈ పంటపైనే ఆధారపడి జీవిస్తున్నాం. రూ.30వేలు ఖర్చు పెట్టి పంట పండిస్తే రూ.లక్షల వరకు ఆదాయం పొందాను. పంట తీగ జాతి కావడంతో విత్తనాల కోసం కూడా తెతకాల్సిన పని లేదు. తీగలు వేరుచేసి కొత్తగా నాటితే చాలు మళ్లీ కొత్త పంట మొదలవుతుంది.

అసంపూర్ణ గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి
తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి చేయూతనిస్తూ అదనపు సాయంగా రూ.50 వేల నుండి ఒక లక్ష రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో గృహనిర్మాణం, రెవెన్యూ సమస్యల పరిష్కారం, కుప్పం అభివృద్ధి, తాగునీటి సమస్యలపై జిల్లా కలెక్టర్ పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం అందించేలా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, ఎస్‌సి, బిసి లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.75వేలు నుండి ఒక లక్ష వరకు అదనపు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సంబంధించి 17,800 మంది లబ్ధిదారులను గుర్తించడం జరిగిందని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తామని, ఇంటి నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.1.20కోట్లు ఖర్చు చేస్తామని తెలిపారు. ఇంటి నిర్మాణాల పురోగతిపై మార్చి 15 నుండి సర్వే చేపట్టడం జరుగుతుందని, డిసెంబర్ 2024 తరువాత ఇంటి నిర్మాణాలు పూర్తి చేసిన వారికి త్వరితగతిన బిల్లుల చెల్లింపు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో డికెటి పట్టాలు, వెబ్ ల్యాండ్ సక్రమంగా నిర్వహించకపోవడం కారణంగా రెవెన్యూ సమస్యలు అధికంగా ఉత్పన్నమయ్యాయని, రెవెన్యూ అంశాలు, రీ సర్వే సమస్యల పరిష్కారానికి రెండు విధాల గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణలో భాగంగా భూ సమస్యలు, మ్యుటేషన్స్, సర్వే నెంబర్, రీ సర్వే సమస్యలు, దాదాపు 10 వేల వినతులు అందాయని, వినతులను ఆన్ లైన్‌లో నమోదు చేశామని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి 1500 వినతులు పరిష్కరించామని తెలిపారు. వెబ్‌ల్యాండ్ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఓ కార్యాలయానికి స్వయంగా వెళ్లి పరిష్కరించేలా సూచనలు చేయడం జరిగిందని తద్వారా 45 రోజులలో అధిక శాతం సమస్యల పరిష్కారం చేయడం జరిగిందన్నారు. వెబ్ ల్యాండ్ సమస్య ఉన్నట్లయితే ప్రజలు తహశీల్దార్ కార్యాలయంలో వినతులు సమర్పించవచ్చని, పరిష్కారం కాకపోతే ప్రతి సోమవారం జిల్లా స్థాయి పిజిఆర్ఎస్‌కు రావచ్చని తెలిపారు. ఎంజిఎన్ఆర్ ఈజిఎస్‌కు సంబంధించి జూన్ 2024 నుండి 1500 రోడ్ల నిర్మాణానికి రూ.99 కోట్లు, 2100 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.48 కోట్లు మంజూరు చేశామన్నారు. 1200 రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసి రూ.65 కోట్లు, 1260 గోకులం షెడ్ల నిర్మాణాలను రూ. 21 కోట్లతో పూర్తి చేసి బిల్లులు చెల్లించామన్నారు. మిగిలిన పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి బిటి రోడ్లు, సిసి రోడ్లు, లేఔట్ కాలనీ రోడ్ల నిర్మాణానికి రూ.120 కోట్లతో ప్రణాళికలు తయారు చేశామన్నారు. ముఖ్యమంత్రి జిడి నెల్లూరు పర్యటనలో భాగంగా రూ.30 కోట్లు మంజూరు ఉత్తర్వులు ఇప్పించడం జరిగిందన్నారు. ఎంపి లాడ్స్ కింద రూ.5 కోట్లతో 90 అభివృద్ధి పనులు చేపట్టి 70 పనులు పూర్తి చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవల పై టాటా సంస్థ ద్వారా కోలార్, ఒరిసా ప్రాంతాలలో కొన్ని పైలట్ ప్రాజెక్ట్ లు నిర్వహించడం జరిగిందని, ఈ సర్వే కుప్పం లో చేపట్టడం జరుగుతుందని, ఈ ప్రాజెక్ట్ సంబంధించి రూ.5 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని, జూన్ 1న కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొదటిసారి కుప్పంలో ప్రారంభించి కుప్పం ఏరియాలో ఉన్న 13 పిహెచ్‌సిలలో వీటిలో వైద్యనిపుణులతో టెలీ కన్సల్టెన్సీ, ఆన్‌లైన్ రికార్డుల నిర్వహణ, రెఫరల్ విధానం, మేనేజర్‌ల ఏర్పాటు, కాల్ సెంటర్‌ల ఏర్పాటు, కొత్త యాప్ తయారు చేస్తామన్నారు. క్రమంగా జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలో ఈ ప్రాజెక్ట్ అమలులోకి వస్తుందన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తట్టుకోవడంలో భాగంగా ఆర్ డబ్ల్యుఎస్, ఎంపిడిఓ అధికారుల ద్వారా నీటి బోరుల మరమ్మతుల, పైప్ లైన్ లీకేజిలను గుర్తిస్తున్నామన్నారు. నీటి ట్యాంక్‌లను శుద్ధి చేయడం చేస్తున్నామన్నారు. గత 3 నెలల్లో రూ.8 కోట్లు జెడ్‌పి నిధులు కేటాయించి నీటిబోర్ల మరమ్మతు, పంపుసెట్‌ల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్‌ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. పలమనేరు, చిత్తూరు మునిసిపాలిటీ ప్రాంతాలలో తప్ప మిగిలిన ప్రాంతాలలో నీటి సమస్య లేదన్నారు. రానున్న 3 నెలాలు చాలా కీలకమని, నీటి ట్యాంక్‌తో అవసరం లేకుండా నీరు అందించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

అంతర్జాతీయ చిత్రకళా పోటీలో
దామోదరాచారికి స్వర్ణ పతకం

ప్రజాశక్తి- యాదమరి: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా 'టాలెంటిలా ఆర్ట్ ఫౌండేషన్ హర్యానా' వారు నిర్వహించిన అంతర్జాతీయ ఆన్‌లైన్ చిత్రకళా పోటీలో యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి పాల్గొని గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు.

చిత్రం పేరు: త్యాగానికి ప్రతీక
నీటి రంగులతో చిత్రించిన చిత్రం
బహుమతి: స్వర్ణ పతకం
చిత్ర కళాపోటీ:ఇంటర్ నేషనల్ ఆన్‌లైన్ ఆర్ట్ కాంటెస్ట్

స్వాతంత్ర్యం కోసం ఎందరో దేశభక్తులు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా త్యజించారు. ఒక దేశభక్తుడు భరతమాత దాస్య శృంఖలాలు త్రెంచడానికి తన శిరస్సును అర్పిస్తూ బలిదానానికి వెనకాడని దేశభక్తి తాలూకు సంఘటన ఒకవైపు. అతని భార్య తన పసుపు కుంకుమల్ని భరతమాతకు నైవేద్యం అర్పిస్తుండగా భారత మాత శవపేటికపై కూర్చొని దుఃఖిస్తున్న సన్నివేశం. పురుషుని త్యాగం గొప్పదే. కానీ దాని వెనుక ఒక స్త్రీ మూర్తి త్యాగం కూడా దాగుందన్న సత్యాన్ని చాటి చెప్పే చిత్రం త్యాగానికి ప్రతీక. ఈ పోటీలో ఇండియాతోపాటు కొసావో, నైజీరియా, సింగపూర్, టర్కీ, ట్రిని డాడ్ అండ్ టొబాగో, కెనడా, ఘనా, యూఎస్ఏ, దుబాయ్, ఇరాన్, వియత్నాం, ఈక్వడార్, ఇండోనేషియా, పాకిస్తాన్‌కు దేశచిత్రకారులు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ నుంచి కె.దామోదరాచారి ఒకరే అవార్డు గెలుచుకోవడం విశేషం.

నేడు కవయిత్రి మొల్ల జయంతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 13న కవయిత్రి అటుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో కవయిత్రి మొల్ల జన్మదిన వేడుకల సందర్భంగా మార్చి 13న ఉదయం 10.30 గంటలకు జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్‌లో కవయిత్రి అటుకూరి మొల్లమాంబ చిత్రపటంకు పుష్ప మాలంకరణతో అంజలి ఘటించు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

వెబ్ ల్యాండ్ కరెక్షన్‌పై దృష్టి పెట్టండి

నాణ్యతతో పూర్తి చేయండి: కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు): వెబ్ ల్యాండ్ కరెక్షన్‌పై దృష్టిపెట్టాలని, నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీతో కలిసి సర్వే శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత అంశాలే అర్జీలుగా వస్తాయని, సర్వేకు సంబంధించిన సమస్యలు కూడా ఎక్కువగా వస్తున్నాయని క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, సర్వేయర్లు బాధ్యతాయుతంగా పనిచేయడం ద్వారా సమస్యల పరిష్కారం త్వరగా జరుగుతుందన్నారు. ఈ నెలాఖరులోపు వెబ్ ల్యాండ్ కరెక్షన్స్ అన్ని పూర్తిచేయాలని తెలిపారు. వెబ్ ల్యాండ్ కరెక్షన్స్‌లో సంబంధిత రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో అనుభవంలో ఉన్న వారి వివరాలు అన్ని పరిశీలించిన పిదప కరెక్షన్స్ పూర్తి చేయాలన్నారు. వీఆర్వోలు సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనిచేస్తూ వారి పరిధిలో గల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో భాగంగా నోషనల్ ఖాతా రెగ్యులరైజేషన్, మ్యూట్షన్ సంబంధిత సర్వే అంశాలకు సంబంధించి మండలాల వారీగా కలెక్టర్, జెసి సమీక్షించారు. సర్వే శాఖ ఏడి జయరాజ్, జిల్లా నోడల్ ఆఫీసర్ గణేష్, అన్ని మండలాల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగస్వాములు కండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో నగర ప్రజలు భాగస్వాములు కావాలని.. స్వచ్ఛ చిత్తూరుకు ఓటు వేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్వచ్ఛ సర్వేక్షన్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఓటింగ్‌పై రూపొందించిన గోడ పత్రికలను జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాలు జరుగుతున్న తీరుపై ప్రజలు స్పందించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ పోర్టల్‌లో తమ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ పోస్టర్లను, వెబ్ సైట్, క్యూఆర్ కోడ్ లను అన్ని వార్డు సచివాలయాల్లో అందుబాటు లో ఉంచాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రపంచ కిడ్నీ దినోత్సవ సంబరాలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలోని అపోలో డయాలసిస్ సెంటర్ వారు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడా పీడీ వికాస్ మర్మత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బిఆర్.సురేష్ బాబు, లయన్స్ క్లబ్ సలహాదారు డాక్టర్ మహేష్, విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని శరీరంలో కిడ్నీ వ్యవస్థ చాలా ముఖ్యమైనదని, కావున దానిని కాపాడుకోవాలని సూచించారు. మధుమేహం, అధిక రక్తపోటు, కిడ్నీ సమస్యలకు ముఖ్య కారణమని తెలిపారు. కావున అది రాకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నేడు యువతలో చైతన్యం లోపించిందని, మత్తుకు బానిస అవుతున్నారని దీని ద్వారా అనేక విధాలుగా మూత్రపిండాలకు హాని కలుగుతుందని, ప్రజలు తమ ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి శ్రద్ధ చూపాలని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుప్పం నర్సింగ్ కళాశాల విద్యార్థినులు చేసిన నాటకం, సుబ్రహ్మణ్యం మ్యాజిక్‌షో అందరిని ఆకట్టుకుంది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుప్పం మెడికల్ సూపరింటెండెంట్ విజయకుమారి, డాక్టర్ ప్రభాకర్, అపోలో డయాలసిస్ సెంటర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, కుప్పం నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కడా పీడి

పని ప్రదేశాల్లో ఇబ్బందులపై కమిటీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పనిప్రదేశాల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. వేధింపుల నిషేధం, నియంత్రణ, పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పీవోఎస్‌హెచ్ చట్టం మేరకు నగరపాలక పరిధిలో మహిళా సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. బుధవారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనిప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, ఇతర సమస్యలను నివారించడం, నియంత్రించడంలో భాగంగా పీవోఎస్‌హెచ్ చట్టంలో భాగంగా కార్యాలయంలోని మహిళా అధికారులు, ఎన్జీవో, మహిళా న్యాయవాదితో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ నెలలో ఒకసారి సమావేశమై మహిళల నుంచి అభిప్రాయాలను, ఫిర్యాదులను స్వీకరిస్తుందన్నారు. మహిళలు పనిప్రదేశాల్లో పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో విధులు నిర్వహించేందుకు వీలుగా కమిటీ విధులు నిర్వహిస్తుందన్నారు. ఏసీపీ సుభప్రధ, ప్రిసైడింగ్ అధికారిగా, డీఈఈ టి.శ్రావణి కన్వీనర్‌గా, సీనియర్ అసిస్టెంట్ వి.తనూజ, ఎన్జీవో నుంచి ఐహెచ్‌ఆర్పీసీ కార్యదర్శి శోభారాణి, న్యాయవాది పి.నిషిత సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పి.లోకేష్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్

అభివృద్ధిని ప్రచారం చేయాలి: మాజీ మంత్రి


సమావేశానికి హాజరైన అనగంటి హరికృష్ణ

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వైసిపి ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హయాంలో చేసిన అభివృద్ధిని మీడియా ద్వారా ప్రచారం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి వైసిపి నాయకులకు పిలుపు నిచ్చారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తిరుపతి లో బుధవారం పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన అభివృద్ధిపనులు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రజలకు మీడియా ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సమావేశంలో ఆయన వెంట ఈయన మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి నాయకులు డాక్టర్ అనగంటి హరికృష్ణ, వెదురుకుప్పం వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

బాధ్యతలు స్వీకరించిన హేమశ్రీ

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలం లోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారిగా హేమశ్రీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రవీణ ఉన్నత చదువులు కోసం వెళ్లారు. ఆమె బాధ్యతలను హేమశ్రీకి అప్పగించారు.

ఘనంగా జెడ్పీ హైస్కూలు వార్షికోత్సవం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూలు వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయులు సిద్దయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థిని విద్యార్థులతో కలిసి గౌరీ పూజ , సరస్వతి పూజ చేసి గురువుల వద్ద ఆశీర్వాదం పొందారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించింది వైసీపీ ప్రభుత్వమే..

సీఎం పీఏ మనోహర్

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలో విద్యావ్యవస్థను వైసీపీ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని సీఎం పీఏ మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా సకాలంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్‌ను అందించాయని ఆయన తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటి పేరును విద్యాదీవెన పేరుగా మార్చి, కాలేజీలకు నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించకుండా, తల్లిదండ్రుల ఖాతాల్లో జమచేసి విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు చెల్లించకుండా వెళ్లిపోయిందని తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో మంత్రి నారా లోకేష్ ఆ బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లకు నిధులను విడుదల చేశారన్నారు.

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు సమావేశం

ప్రజాశక్తి - చౌడేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం, వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జ్ఞానజ్యోతి ట్యుటోరియల్ నిర్వాహకులు జే.ప్రభాకర్, డి.రోహిత్ లీల స్పోర్సర్ సుజన్ రాజు దాతృత్వంతో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించారు. ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో మొదటి స్థానం తెచ్చుకున్న విద్యార్థికి రూ.5వేలు, రెండవ వారికి రూ.3వేలు, మూడవ స్థానం తెచ్చుకున్న విద్యార్థికి రూ.2వేలు ఆర్థిక సాయం చేస్తానని దాత సుజన్ రాజు తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి- సోమల: పాఠశాలల్లో సి, డి గ్రేడ్ కలిగి చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి మార్కుల్లో జరగబోయిన పాఠ్యాంశాలను పునరేచేయాలని బుధవారం జరిగిన సీఆర్పీ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సూచించారు. కందూరు, సోమల, నంజంపేట, పెద్ద ఉప్పరపల్లె ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పడిన సీఆర్సి సెంటర్లలో సీఆర్పి సమావేశాలు నిర్వహించారు. విద్యాశాఖ తెలిపిన ప్రకారం పాఠ్యాంశాలను పూర్తిచేయాలని ఉపాధ్యాయులను కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బుధవారం నలంద విద్యాసంస్థల యాజమాన్యం ద్వారా విద్యాసామగ్రిని టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉపయోగపడే డాక్యుమెంట్స్ ఫైల్స్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్‌ను బహూకరించారు. గ్రామాలు సాధించిన విద్యార్థులకు నలంద విద్యాశాఖలలో ఉచిత విద్యను అందిస్తామన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. నలంద కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, టిడిపి నేతలు బాలరాజు, సుబ్బి, కేశవరెడ్డి, నరసింహులు, అధ్యాపకులు వినయ్ రెడ్డి, హరిప్రసాద్, సుబ్రహ్మణ్యం, శివకుమార్, హరికృష్ణ, మమత, నందిని పాల్గొన్నారు.

తవణంపల్లి: యువనేత పార్థసారథి సహకారంతో అరగొండ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రి వితరణ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి చెడు మార్గంలో వెళ్లకుండా, పరీక్ష సమయంలో ఒత్తిడి లేకుండా బాగా చదివి పరీక్షలు మంచిగా రాసి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని చెప్పారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల విద్యాభివృద్ధికి, క్రీడాభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పార్థసారథి, యువరాజ్ రెడ్డి, అజిత్ పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాబోయే పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. బుధవారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. హెచ్ఎం మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు విద్యాభ్యాసంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పూర్వ విద్యార్థులు సోమసుందరం పిళ్లై, సుధాకర్, భీమయ్యలు క్రీడల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. విశ్రాంతి ఉద్యోగి సుధాకర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయ, తమ తల్లిదండ్రుల పేరుపై ప్రతి ఏడాది విద్యార్థులకు రూ.5వేలు అందిస్తామని తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ తాళ్లూరు, సరస్వతి, హరిత, మాలతి, సుమతి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - గుడిపాల: విద్యార్థులు ఒత్తిడిని వదిలి ప్రణాళిక ప్రకారం చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని మండల విద్యాశాఖాధికారి హసన్ బాషా అన్నారు. బుధవారం మండలంలోని నరహరిపేట ఉన్నత పాఠశాల, బొమ్మసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. బొమ్మసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కమిటీ చైర్మన్ టిఆర్ ఫ్లిప్ బాయ్, ప్రధానోపాధ్యాయులు కాశులు, ఉపాధ్యాయులు వాణి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: కమ్మనపల్లి బాలికల గురుకుల పాఠశాల 2025-26 వ విద్యాసంవత్సరానికి 6, 7, 8వ తరగతులలో మిగిలి ఉన్న ఖాళీలకు ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలనే వివరాలు ఉన్న వాల్ పోస్టర్లను బైరెడ్డిపల్లి, గంగవరం మండలాల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 12 నుంచి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకొవాలని తెలిపారు. ఏప్రిల్ 25న జిల్లా ప్రధానకేంద్రంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చౌడేపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి వాసవి వనిత క్లబ్ వారు బుధవారం ఆర్థికసాయం అందించారు. ఇటీవల చౌడేపల్లికి చెందిన శ్రీనివాసులు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని కుటుంబ సభ్యులకు వాసవి వనిత క్లబ్ అధ్యక్షుడు ఐ.ఎం.రామకుమార్, ఇంటర్నేషనల్ ఆఫీసర్ నాగలక్ష్మి, అధ్యక్షులు శ్రీనాథ్, నాగలక్ష్మి, లోకేష్ అమర ఆర్థిక సాయం అందించారు.

కల్లూరు వారపు సంత వేలంపాట

ప్రజాశక్తి- రొంపిచర్ల : పులిచెర్ల మండలం కల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని వారపు సంతకు బుధవారం పంచాయతీ ఆఫీసులో కల్లూరు గ్రామ సర్పంచ్ షుకూర్, ఇంచార్జ్ ఎంపీడీవో రాజశేఖర్ బాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో వారపు సంత, దినసరి మార్కెట్‌కు రూ. 6.25 లక్షలు, ప్రైవేటు బస్టాండుకు రూ.1.78 లక్షలు, షాపింగ్ కాంప్లెక్స్ రూ.26 వేలు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. వేలంపాట ద్వారా మొత్తం ఆదాయం రూ.8.29 లక్షలు ఆదాయం గ్రామపంచాయతీకి సమకూరిందని తెలిపారు.

రథంపై ఊరేగిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఆవులపల్లె గ్రామంలో వెలసిన అతి పురాతన దేవాలయం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై పురవీధులలో ఊరేగించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వార్షిక బ్రహ్మోత్సవాలలో ఉదయం మూల విరాట్‌కు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం మూడు గంటల వరకు ఆవులపల్లె పురవీధులలో రథోత్సవం నిర్వహించగా భక్తులు కర్పూర నీరాజనాలను అందజేశారు.

వేరుశనగలో మెలుకువలు పాటించాలి

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : వేరుశనగ రైతులు మెలుకువలు పాటించాలని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కుప్పం మండలం వానగుట్టపల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు నూనె గింజల పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ముఖ్యంగా వేరుశనగ పంటలో యాజమాన్య జాగ్రత్తలను వివరిస్తూ, వేరుశనగ పంట వల్ల కలిగే లాభాలను వివరించారు.

స్కిల్ యాప్ వినియోగంపై శిక్షణ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల రైతుసేవ కేంద్రంలో బుధవారం మండల వ్యవసాయ శాఖ సిబ్బందికి రైతులకు స్కిల్ యాప్‌పై డిజిటల్ ట్రైనింగ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు రైతు సేవా సిబ్బందికి వాతావరణ సమాచారం గురించి అవగాహన కల్పించడం ద్వారా వాతావరణ సమాచారానికి అనుగుణంగా వ్యవసాయ పనులు చేపట్టడం, వివిధ మార్కెట్లలో వివిధ పంటలలో ధరలు, డిజిటల్ చెల్లింపులు గురించి తెలిపారు. టెక్నికల్ వ్యవసాయ అధికారి దీప మాట్లాడుతూ ఏ పంట ఎప్పుడు ఎలా విత్తనం వేయాలి? పంట కోసే వరకు అధిక దిగుబడి తీసుకువచ్చేందుకు నూతన యాజమాన్య పద్ధతులు తెలుసుకోవచ్చునని, మార్కెటింగ్ వివరాలు కూడా పూర్తిగా తెలుసుకొని రైతులు లబ్ధి పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎంపీఈవోలు రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి- శాంతిపురం: కదిరిముత్తనపల్లి గ్రామంలో పెద్దదేవర జాతర సందర్భంగా ఎక్కువ సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నందున చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో ఎపిఆర్.కుమార్ తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతిరోజు సుమారు 40 నుంచి 50 వరకు పారిశుద్ధ్య కార్మికులను వినియోగించి శ్రీ సిద్దేశ్వరస్వామి దేవాలయం పరిసర ప్రాంతాలలో శుభ్రం, బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ వంటి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తున్నందున పారిశుద్ధ్య పనులలో లోపం లేకుండా ఎక్కువ సంఖ్యలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయడం జరిగినదని, దీన్ని అందరు గమనించి ఎక్కడా కూడా అపరిశుభ్రతకు తావు లేకుండా వ్యవహరించి గ్రామ పంచాయతీకి సహకరించాలని తెలిపారు.

తాగునీటి సమస్యపై స్పందించిన ఎంపీడీవో

ప్రజాశక్తి- శాంతిపురం: కడపల్లి గ్రామపంచాయతీలోని పొడుచేన్లు గ్రామంలో తాగునీటి సమస్య గురించి ఎంపీడీవో ఏపీఆర్ కుమార్‌కు గ్రామస్తులు విన్నవించారు. ఈ సమస్యపై స్పందిస్తూ ఎంపీడీవో కడపల్లి పంచాయతీ కార్యదర్శి అంజాద్‌ను పిలిపించి పోడుచెండ్లు గ్రామంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని గ్రామంలో ఉన్న బోరుకు నూతన మోటర్‌ను వేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీడీవో సూచన మేరకు బోర్‌కు కావలసిన మోటారు సమకూర్చి గ్రామనీటి సమస్య పరిష్కారం చూపారు.

ఏపీవో లలిత బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో పని చేస్తున్న ఏపీవో చంద్రశేఖర్ బదిలీపై నింద్రకు వెళ్లడంతో నింద్ర మండలంలో ఏపీవోగా పనిచేస్తున్న లలిత ఎస్ఆర్ పురం ఏపీవోగా బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బుధవారం అధికారులతో సిబ్బందితో సమావేశం నిర్వహించి ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు.

రైతులకు డిజిటల్ ట్రైనింగ్

ప్రజాశక్తి- రొంపిచర్ల: రొంపిచర్ల మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు, రైతు సేవ కేంద్రం సిబ్బందికి వ్యవసాయ విధానాలపై జిల్లా వ్యవసాయశాఖ వారు డిజిటల్ శిక్షణా తరగతులు నిర్వహించారు. వ్యవసాయపంట వివరాలు, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ధరలు, డ్రోన్ల వినియోగం తదితర అంశాలపై యాప్‌ల ద్వారా రైతులకు వివరించారు. రైతులు ఈ శిక్షణా తరగతుల ద్వారా తమ నైపుణ్యాన్ని పెంచుకొని వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సుధారాణి, చంద్రశేఖర్, వెంకటరమణ, శివప్రసాద్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ నిర్వహించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : జిల్లాలో రసాయనాల ఉత్పత్తుల పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లాలో సంక్షోభ నివారణ చర్యలపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, ప్రమాదాల సమయంలో అపాయం నుండి తప్పించుకునే మార్గం, ప్రమాదాల నివారణపై ప్రతి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి పరిశ్రమలో సంబంధిత అధికారులు సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించాలని, సంబంధిత అధికారులు మాక్ డ్రిల్‌కు హాజరు కావాలన్నారు. పరిశ్రమలో ప్రమాదాల సమయంలో తీసుకునే చర్యలపై అవగాహన కల్పించేలా ఫైర్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రమాదాల సమయంలో పక్కనున్న పరిశ్రమలకు లేదా ఇతర నిర్మాణాలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సహజంగా రసాయనాల పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు, భారీ పేలుడు, విషవాయువుల విడుదల వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రతి మూడు మాసాలకు ఒకసారి పరిశ్రమలలో మెరుగైన భద్రతా ప్రమాణాలపై తీసుకున్న చర్యలపై రిపోర్ట్‌ను జిల్లా ఫ్యాక్టరీ అధికారులు పరిశీలించాలన్నారు. పరిశ్రమలు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. జిల్లా ఫ్యాక్టరీ చీఫ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, జిఎం ఇండస్ట్రీస్ వెంకటరెడ్డి, జిల్లా ఫైర్‌ఆఫీసర్ పెద్దిరెడ్డి, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సమస్యలపై సమావేశం

జీవ వైవిధ్య సమస్యల సమావేశానికి హాజరైన ముఖ్యులు

ప్రజాశక్తి -గుడిపల్లి: తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో జీవవైవిధ్య సంబంధిత సమస్యలపై చర్చా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య బోర్డు ఛైర్మన్ ఎన్ విజయ కుమార్, ఎస్‌పిఎంవివి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమ, ద్రావిడ విశ్వ విద్యాలయం, ఐఐఎస్ఇఆర్, ఐఐటితో సహా ఐఐసి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో జీవ వైవిధ్య నిర్వహణ కమిటీలు, పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్స్ వంటి సమస్యలపై ఈ చర్చలు దృష్టి సారించాయి. ఐఐసి ప్రాజెక్ట్ కో ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్లు డాక్టర్ వి మెర్సీ జ్యోతి, డాక్టర్ ఎస్ రాజేశ్వర రెడ్డి చర్చల్లో పాల్గొని చిత్తూరు జిల్లాలోని పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్లపై ప్రాజెక్ట్ ప్రతిపాదన కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం పొందారు. సమావేశానికి హాజరైన వారిలో ఎస్‌పిఎంవివి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనీ, ఐఐసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డిఎం మమత, ఐఐటి నుండి డాక్టర్ ప్రసన్న, ఐఐఎస్ఇఆర్ నుండి వినోద్, వర్ష ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నామమాత్రంగా జంగిల్ క్లియరెన్స్ పనులు

- యంత్రాలతో పనులు, తొలగని ముళ్లకంపలు
- రహదారికి ఇరువైపులా ప్రమాదకరంగా మొక్కలు

ప్రజాశక్తి -గంగవరం: రహదారులకు ఇరువైపులా ముళ్లకంపలు తొలగించి గుంతలు పూడ్చడానికి రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఏడాదిలో ఒకసారి రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడతారు. ఈ పనులు కార్మికులచే పని చేయించాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే గుత్తేదారులు జెసిపిలు, బుల్డోజర్లతో నామమాత్రంగా పనులు చేపట్టడంతో రహదారికి ఇరువైపులా ఉన్న గుంతలు పూడ్చలేదు. ముళ్ల పొదలు తొలగిన దాఖలాలు లేవు. ఈ గుత్తేదారులకు కిలోమీటర్లకు కొంత మొత్తాన్ని ప్రభుత్వం కేటాయిస్తుంది. కూలీలతో పనులు చేయిస్తే ఖర్చు ఎక్కువ అవుతుందన్న నెపంతో జెసిపిలతో పనులు చేసి లక్షల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని పేర్కొంటున్నారు.

మలుపుల వద్ద ఏపుగా పెరిగిన చెట్లు

అక్కడక్కడా తొలగని ముళ్ల చెట్లు

గంగవరం మండలంలో పలమనేరు నుండి గుండిగల్లు , పలమనేరు నుండి శంకర రావుపేట, పుంగనూరు- బైరెడ్డిపల్లి రహదారులతో పాటు గ్రామీణ రహదాలలోనూ ఈ కార్యక్రమం చేపడతారు. గ్రామీణ ప్రాంతాలలో అనేకచోట్ల ప్రమాదకరమైన మలుపులు వున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు సైతం కనిపించవు. ఇలాంటి ప్రాంతాలలోనూ ముళ్ల పొదలు తొలగించిన దాఖలాలు లేవు. సంబంధిత అధికారులు ఈ రహదారులను పరిశీలించి నాణ్యమైన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వారపు సంత బహిరంగ వేలం

ప్రజాశక్తి- శాంతిపురం : మండల పరిధిలోని కెనమాకులపల్లి గ్రామసచివాలయంలో పంచాయతీ కార్యదర్శి జి.అశ్వత్థ నారాయణ, గ్రామపంచాయతీ సర్పంచ్ ఏవి.జయరాం ఆధ్వర్యంలో బడుగుమాకులపల్లిలో ప్రతి ఆదివారం జరిగే వారపు సంత బహిరంగ వేలంను బుధవారం నిర్వహించారు. బడుగుమాకులపల్లి వారపు సంతలో నిర్వహిస్తున్న పశువుల సంత ఆవుపేడతో సహా వేలం ద్వారా వి.కోటకు చెందిన ఎన్.శ్రీనివాసులు రూ.11,15,000లకు దక్కించుకున్నారు. అంగళ్ల గేటును వేలం ద్వారా శాంతిపురానికి చెందిన వి.సుబ్రహ్మణ్యం రూ.4,80,000లకు, ఆటోలకు, ప్రైవేటు వాహనాల రుసుములు గేటును వేలం ద్వారా రేగడిదిన్నె పల్లి గ్రామానికి చెందిన గణేష్ రూ.5,30,000లకు దక్కించుకున్నారు. గొర్రెలు, కోళ్ల సంతను వీ.కోటకు చెందిన గీతమ్మ రూ.5,35,000లకు దక్కించుకున్నారు. ఈ బహిరంగ వేలం ద్వారా హెచ్చుదారులు దక్కించుకున్నారు. కెనమాకులపల్లి గ్రామపంచాయతీకి వారపుసంత వేలం ద్వారా మొత్తం రూ.26,60,000లు ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. చిత్తూరు జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి ఎన్.రాధాకృష్ణ, ఈవోపీఆర్డి బి.ఆర్.రవి నాయక్, గ్రామ సచివాలయ సిబ్బంది, వేలంపాట దారులు పాల్గొన్నారు.

సొన్నేపల్లిలో తీరిన నీటి కష్టం

గ్రామస్తుల హర్షం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లి పంచాయతీ పరిధిలోని సొన్నేపల్లి గ్రామంలో ఎట్టకేలకు నీటికష్టం తీరింది. గతంలో ఉన్న బోరులో నీరు అడుగంటి పోవడంతో ఈ వేసవిలో నీటిసమస్య తలెత్తుతుందని గ్రామస్తులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బోరు డ్రిల్ చేసి మోటారు పైపులను అమర్చకుండా విస్మరించారు. దీంతో తమ గ్రామంలో నీటిసమస్యను పరిష్కరించాలని కొద్దిరోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని గ్రామస్తులు కలసి సమస్యను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే నీటి సమస్య పరిష్కారానికి రూ.3లక్షల జెడ్పి నిధులను మంజూరు చేయించారు. దీంతో మోటర్, పైప్‌లైన్లను అధికారులు బుధవారం అమర్చగా నీరు పుష్కలంగా రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేసవిలో తమ గ్రామానికి ఇక నీటికష్టాలు తప్పినట్టేనని గ్రామస్తులు గౌతమ్ రెడ్డి, పంచాయతీ అధ్యక్షులు బాలకృష్ణ రెడ్డి, బూత్ కన్వీనర్ చందు, బద్రి, జయపాల్ రెడ్డి, నాగరాజ, శ్రీనివాసులు, జగదీష్ హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం: జడ్జి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి భారతి

ప్రజాశక్తి- యాదమరి: న్యాయచట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి భారతి తెలిపారు. బుధవారం డీకే చెరువు గ్రామంలో న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో సీనియర్ సివిల్ జడ్జి భారతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరూ న్యాయచట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి, స్వేచ్ఛ, సమానత్వం, ప్రాథమిక హక్కులు కల్పించింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన హక్కులకు భంగం కలిగించే ఎలాంటి వ్యక్తులైన చట్టం కఠినంగా శిక్షిస్తుందని తెలిపారు. నిరుపేద ప్రజలు, రైతులు న్యాయ సహాయం కావలసిన వారికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఎల్లప్పుడూ ముందుండి వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మనిషి జీవితంలో ఈ ఐదు అంశాలు ముఖ్యమైనవిని ఫ్యామిలీ, స్నేహితులు, దయ, ఇమ్యూనిటీ, ప్రేమ అందరు అలవర్చుకోవాలన్నారు. తెల్లరాళ్లపల్లి సర్పంచ్ బజలింగం, తహశీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఎస్సై ఈశ్వర్ పోలీసులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల పాత్ర కీలకం

ప్రధానోపాధ్యాయులు రవీంద్ర ప్రసాద్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మహిళ లేనిదే సమాజం లేదని ప్రధానోపాధ్యాయులు రవీంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని కోదల మడుగు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సిఆర్‌సిలోని మహిళ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సృష్టిలో మహిళలే కీలకమైన పాత్రని మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, మహిళలేనిది సృష్టి జరగదని, ప్రతి ఒక్కరు మహిళల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. అనంతరం మహిళ ఉపాధ్యాయులకు దుశ్శాలువతో సత్కరించి మెమొంటోళ్లు అందించారు. సిఆర్‌సి ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు అమీన్ హుసేన్, బాలాజీ, వేణుగోపాల్ రెడ్డి, రమ, హేమలత, లలిత, స్వరాజ్య కుమారి, శారద, భారతి పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- కార్వేటినగరం: మహిళా లబ్ధిదారులకు ఉచిత టైలరింగ్ శిక్షణ కోసం దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య, వైశ్య, క్షత్రీయ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా మహిళా లబ్ధిదారులకు టైలరింగ్పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఏపీ-బమమస ద్వారా వారి పేర్లను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల వారు సచివాలయ పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఆదేశాల మేరకు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

రొంపిచర్ల: పులిచెర్ల మండలంలోని 18 నుంచి 50 సంవత్సరాల మధ్య గల మహిళలు ఉచిత టైలరింగ్ శిక్షణతో పాటు కుట్టు మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్చార్జ్ ఎంపీడీవో రాజశేఖర్ బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ శిక్షణ కొరకు మహిళలు ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని బీసీ మహిళలు, కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య తదితర మహిళలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వీరికి శిక్షణ పూర్తయిన తర్వాత కుట్టుమిషన్లను ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలు రెడ్డి

ప్రజాశక్తి- కార్వేటినగరం: నాణ్యమైన విద్యతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని అకడమిక్ అడ్వైజర్లు డాక్టర్ పంకజా, డాక్టర్ శంకర్ రావు పేర్కొన్నారు. బుధవారం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల డైరెక్టర్ ఆదేశాల మేరకు అకడమిక్ అడిట్ నిర్వహించారు. ఆడిట్‌లో భాగంగా అడ్వైజర్లు కళాశాలలోని అన్ని విభాగాల రికార్డులను, ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఎక్టివిటీస్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న మౌలిక వసతులు ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యా లను సాధించ వచ్చని గుర్తు చేశారు. విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని అంది పుచ్చుకొని ఉద్యోగ అవకాశాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండల కేంద్రంలో బుధవారం యువత పోరు వ పార్టీ అధ్యక్షులు మణి ఆధ్వర్యంలో నిర్వాహించారు. ఈసందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కొత్తపల్లి శామ్ యువతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు గురవారెడ్డి, కుప్పయ్య, జనార్ధన్, చిట్టి, మహేష్, శేషాద్రి పాల్గొన్నారు.

పూతలపట్టు: వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని వైసీపీ రాష్ట్ర మేధావుల సంఘం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలు తినిపించుకున్నారు. సర్పంచ్ మాసిలమని, యువ బీసీ నాయకులు రమణ పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల కార్యాలయం ఆవరణంలో వైఎస్సార్ కాంశ్య విగ్రహానికి మండల కన్వీనర్ శేఖర్‌రాజు స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో జీడీ నెల్లూరు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు పంచిపెట్టారు. రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శేషాద్రి, వెంకటేష్, సుందర్‌రాజ్, మునికృష్ణ, నందగోపాల్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని కరిడివారిపల్లిలో వైయస్సార్ విగ్రహం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవం గ్రామకన్వీనర్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మొదట రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ జెండా ఆవిష్కరించారు. భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో కృపాలక్ష్మి వైసిపి జెండా ఎగురవేసి వైయస్ఆర్ విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, ముని రాజారెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం జరిగాయి. మాజీ ఎమ్మెల్యే వేంకటే గౌడ వైసీపీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి కార్యకర్తలు నాయకులకు పంచిపెట్టారు. మండి సుధ, మురళీకృష్ణ, చెంగారెడ్డి, నరేష్, ముజ్జు,సేతు సుభాష్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని పాత గుంటలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

సూపర్ సిక్స్ అమలులో

కూటమి సూపర్ ప్లాప్: మాజీ మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : సూపర్ సిక్స్ అమలు కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టిన కూటమి ప్రభుత్వ భాగస్వాములపై పోరాటాన్ని తీవ్రతరం చేయనున్నట్లు వైసిపి రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు యువత పోరు కార్యక్రమం బుధవారం కలెక్టరేట్ ఎదుట వైకాపా శ్రేణులు నిరసన వ్యక్తం చేసి కెలక్టరు సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో వ్యవహరిస్తూ వైసిపి నేతలపై అక్రమ కేసులు పెడుతోందన్నారు. తమ ప్రభుత్వంలో నిరుద్యోగ యువత, విద్యార్థుల అభివృద్ధి కోసం బడ్జెట్లో నిధులు కేటాయించి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అబద్ధాల హామీతో నిరుద్యోగ యువతను రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎంసి విజయ నంద రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు భరత్, మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి, నియోజకవర్గ ఇన్‌చార్చిలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీ కోదండరామ స్వామి

ప్రజాశక్తి- శాంతిపురం: రాళ్ళబూదుగూరులోని శ్రీ కోదండరామస్వాములవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వ రోజు బుధవారం ఉదయం మోహిని తిరుకోలు నిర్వహించారు. శ్రీ కోదండరామ స్వామి గరుడ వాహనంపై విశేష అలంకారంలో గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా మంగళవాయిద్యాలు నడుమ ఘనంగా జరిగింది. బుధవారం నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు ఉభయ దారులుగా శ్రీనివాస తిరునారాయణ బట్టర్ వారి కుటుంబీకులు, బిఆర్ వరదరాజన్ వారి కుటుంబీకులు, వాల్మీకి సంఘం, జ్యోతినగర ఆర్యవైశ్య సంఘం రాళ్ళబూదుగూరు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, విజయ్ కేవిబి వారిచే నిర్వహించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అన్నదానం చేశారు.

IN THE COURT OF THE IXth ADDL., DISTRICT JUDGE, CHITTOOR
O.S. No. 23 Of 2017

Between:-
T. Komaladevi and others ...Plaintiffs
And:-
A.Krishna Reddy (Died) and others ... Defendants

Suit Summons to the Defendant Nos.22 to 24

To **D.22.** M.Kumari W/o M.Sreenivasulu, residing of D.No.13-132, Madanapalli Road, Palamaner Town and Mandal, Chittoor District
D.23. K.Rathna Reddy S/o K.Changa Reddy,
D.24. A.Rajarani W/o A.Surendra Reddy,
Nos.23 & 24 are residing at Somarajupalli Village, Kallupalli Post, Gangavaram Mandal, Chittoor District.

Sir,
Please take notice that the suit O.S.No.23/2017 posted to 16-04-2025 for your appearance. Hence you are hereby directed to appear before the said Court on 16-04-2025 at 10:30 A.M., without fail either in person or through an Advocate and to file your Written Statement otherwise the matter will be decided ex-parte.

(M. ANAND)
(M. OMKARA VINOD)
Advocates for Plaintiff
D.No.10-106, Gandhi Road Extension, Chittoor Cell:- 9440360170, 7386330333